క్లుప్తంగా

బండి సంజయ్‌కి స్వాగతం



బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చివ్వెంల : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున కోదాడ పట్టణానికి ప్రచారానికి వెళ్తున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి మార్గ మధ్యలో మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ రహదారిపై ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, జుట్టుకొండ సత్యనారాయణ, కడియం రామచంద్రయ్య, ధనుంజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యజమానుల మన్ననలు పొందాలి



సర్వోత్తమ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

భానుపురి : బిల్డర్స్ నాణ్యమైన మెటీరియల్‌తో భవనాలు నిర్మించి యజమానుల మన్ననలు పొందాలని ఏఐసీసీ మెంబర్ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సూర్యాపేట జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్గూరి పాండుగౌడ్, అధ్యక్షుడు కాసర్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి జానయ్య, ఉపాధ్యక్షుడు పన్నాల ఉపేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. శుక్రవారం పట్టణంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, నాయకులు గోపి, మహేష్, నవీన్, పవన్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం గ్రంథాలయానికి శుక్రవారం గ్రామానికి చెందిన డాక్టర్ దేవరకొండ కృష్ణ వివిధ రకాల పుస్తకాలను బహూకరించారు. గ్రామంలో నిరుద్యోగులు ఈ పుస్తకాలను చదువుకొని ఉద్యోగాలకు సిద్ధం కావాలని కోరారు. లైబ్రేరియన్ దార శ్రీనివాస్ కృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, అర్వపల్లిలలో పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడారు. తొలకరిలో పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, గోపాలమిత్ర కుంభం సురేందర్, యాకయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో రక్తదానం

నడిగూడెం : అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన మాదాసు సైదులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సైదులుకు రక్తం అత్యవసరం కావడంతో నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గణేష్, మధు, తిరుమలేష్, ఉపేందర్, సాయి, సంతోష్, వంశీ తదితరులు స్వచ్ఛందంగా ఖమ్మం ఆస్పత్రిలో రక్తదానం చేశారు. దీంతో రక్తదానం చేసిన యువజన సంఘం సభ్యులను పలువురు అభినందించారు.

అర్వపల్లి దర్గాలో ప్రార్థనలు

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గాను శుక్రవారం సూర్యాపేట ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి సందర్శించి బాబా సమాధిపై దట్టీ ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

మురుగు కూపాలుగా వీధులు

- పారిశుద్ధ్య పనులు చేపట్టని అధికారులు
- వ్యాప్తి చెందుతున్న క్రిమి కీటకాలు
- దోమల నివారణ చర్యలు శూన్యం



మంగళితండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



వట్టిఖమ్మంపహాడ్‌లో..

చివ్వెంల : పల్లెల్లో ఇళ్ల మధ్య పరిసర ప్రాంతాలు మురుగు నీటి కుంటలుగా మారుతున్నప్పటికీ సమస్య పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు. ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ నీరు, ఇళ్లలో వినియోగించిన నీరు మురుగుగా ఏర్పడి దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లోని కాలనీల్లో ఇళ్ల మధ్య నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీని వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అయినప్పటికీ పాలకులు, అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్లపైనే మురుగు..

మండలంలోని వట్టిఖమ్మంపహాడ్, పాశ్యానాయక్ తండా, బద్యాతండా, సేవాలాల్ తండా, లక్ష్మణ్ నాయక్ తండా, పులితండా, బి.చందుపట్ల, మున్యానాయక్‌తండా, గుంపుల, తిమ్మాపురం, మొగ్గయ్య గూడెం, మంగళితండా, అక్కలదేవిగూడెం, పిల్లల జెగ్గుతండా తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకుగాను గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో కూడా సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు అంటున్నారు. ఆయా గ్రామాల్లో మురుగు రోడ్లపైనే పారుతోంది. అక్కడక్కడ డ్రెయినేజీలు ఉన్నా వాటిని శుభ్రం చేయించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా వీధుల్లో నీరు నిలుస్తోంది. పైగా డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లలో వినియోగించిన నీరు కూడా వీధుల్లోకి చేరుతోంది. రోజుల తరబడి నీరు నిలుస్తూ వీధులు మురుగుకూపాలుగా మారుతున్నాయి.

జాడలేని ఫాగింగ్, బ్లీచింగ్..

కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ వినియోగించకపోవడంతో తుప్పుపడుతున్నాయి. గ్రామాల్లో రోజుల తరబడి ఎందుకు ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి

గ్రామాల్లో మురుగు కాలువలు సరిగా పూడిక తీయకపోవడంతో ఇళ్ల ముందు మురగు నీరు నిలుస్తోంది. దీని వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మురుగు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. అదే విధంగా ఫాగింగ్ నిర్వహించి దోమల వ్యాప్తిని అరికట్టాలి.

– దరావత్ నరేష్, మంగళితండా

పారిశుద్ధ్య పనులు చేయిస్తాం

గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంతోపాటు, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైన చోట, ఎక్కువగా జనాలు నివసించే ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా చేపడుతాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం.

– టి.గోపి, ఎంపీఓ, చివ్వెంల

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్

అర్వపల్లి : ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు మంచి లాభాలు పొందవచ్చని పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జె. హరీష్ అన్నారు. మండల పరిధిలోని అడివెంల గ్రామంలో రైతు మన్నెం సదాశివరెడ్డి సాగుచేస్తున్న ఆయిల్ పామ్ తోటను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తోట సాగుచేసిన నాలుగేళ్ల తర్వాత ప్రతి నెలా దిగుబడి వస్తుందని అన్నారు. పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఈ పంటను సాగుచేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు, రైతులు మన్నెం సదాశివరెడ్డి, ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

28నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

నాగారం : వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా వర్ధమానుకోట గ్రామంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ చైర్మన్ మేడోజు పోతులూరి చారి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. 28న ఆలయంలో పచ్చతోరణం, గణపతిపూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ, తీర్థప్రసాద వితరణ, 29న అభిషేకం, ధ్వజారోహణం, గణపతి హోమం, రుద్రహోమం, 30న ఎదుర్కోళ్లు, స్వామి వారి కల్యాణం, పూర్ణాహుతి, స్వామివారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించబడుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యుడు మేడోజు రామబ్రహ్మాచారి, బొల్లు వీరయ్యానాయుడు, మేడో జు ఆంజనేయులుచారి, ఆకుల వెంకటయ్యాగౌడ్, పోతులూరి చారి, ఆకుల శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

అర్వపల్లి : తిమ్మాపురంలో ఆటో బోల్తాపడి గాయపడిన ఉపాధి కూలీలను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూలీలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. గ్రామానికి 5 కిలోమీటర్ల దూర ప్రాంతంలో పనులు పెట్టడం వల్ల అంతదూరం నడిచి వెళ్లలేక ప్రైవేట్ వాహనాలలో పోతూ ప్రమాదానికి గురయ్యారని చెప్పారు.

నిరుద్యోగ యువత మల్లన్నకు ఓటేయాలి



సూర్యాపేటలోని గ్రంథాలయంలో యువతతో మాట్లాడుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి : పట్టభద్రులైన నిరుద్యోగ యువత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేంద్రశాఖ గ్రంథాలయంలో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తుందన్నారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నిరుద్యోగ యువత ఏ సమస్య ఎదురైనా నేరుగా వచ్చి తనకు చెప్పవచ్చని తెలిపారు. గ్రంథాలయంలో కుర్చీలు, ప్యాడ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నామని యువత చెప్పడంతో సొంత ఖర్చులతో వంద కుర్చీలు, ప్యాడ్లు అందిస్తానని అన్నారు. వెంటనే దుకాణదారుడితో మాట్లాడి గ్రంథాలయానికి కుర్చీలు, ప్యాడ్‌లు సరఫరా చేయాలని తెలిపారు. ఆయన వెంట ఏఐసీసీ మెంబర్ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు బైరు శైలేందర్, అనంతుల యాదగిరి, కుంభం రాజేందర్, బచ్చలకూరి శ్రీనివాస్, వేములకొండ పద్మ, గండూరి రమేష్, ఆలేటి మాణిక్యం పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ప్రైవేటు ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా మల్లన్న గెలిస్తే ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాజా, డాక్టర్ రాంమూర్తియాదవ్, షఫీఉల్లా, ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి జానయ్య, నిమ్మల వెంకన్న, కరుణాకర్, వల్దాసు దేవేందర్, బైరబోయిన శ్రీను, తండు శ్రీనివాస్, దైద వెంకన్న, కల్యాణ్, రామకృష్ణ, ఆనంద్, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు నలమాస ఉపేందర్, వల్లపు రమేష్, రవి, కసనబోయిన లింగయ్య, ఉమేష్, కూజ ఎల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి



మద్దిరాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి



ఆత్మకూర్ (ఎస్) : పాత సూర్యాపేటలో..



చివ్వెంలలో..

చివ్వెంల : రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఆశాకుమారి అన్నారు. విత్తనాల కొనుగోలుపై శుక్రవారం మండల కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రసాయనిక ఎరువులు వీడి, సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. దీని వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఇందిర, సాయి, వెంకట్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి దివ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాత సూర్యాపేట గ్రామంలో విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సాగులో విత్తనాల ఎంపిక కీలకమని తెలిపారు. కంపెనీ విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. తక్కువ ధరకు విత్తనాలు వస్తున్నాయని భావించి నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాచకొండ శివకుమార్, గ్రామస్తులు వెంకన్న, లింగమ్మ, ఉప్పమ్మ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్ అన్నారు. శుక్రవారం మాచారం, నూర్జహాన్‌పేట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు విత్తనాలకు సంబంధించిన బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్ మీద విత్తనం కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, రేటు ఉండాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, లూస్ విత్తనాలు అమ్మినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మనోజ్, గోపి, సుష్మాస్వరాజ్, సంధ్య, రేణుక పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

నూతనకల్ : బీజేపీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలిచే వ్యక్తి ప్రేమేందర్‌రెడ్డి అని తెలిపారు. పది సంవత్సరాలుగా మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధిని చూసి బీజేపీకే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, కాప రవి, మద్ది సంజీవ రెడ్డి, మాతంగి వెంకన్న, జక్కుల ఉప్పలయ్య, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వీరస్వామి, నాగయ్య, వెంకటమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన వెలుగు చంద్రశేఖర్ కుమారుడు ఉత్తమ్‌కుమార్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో స్థానికులు ఎవరికి తోచిన విధంగా వారు వైద్య ఖర్చుల కోసం సాయమందిస్తున్నారు. అలాగే అర్వపల్లికి చెందిన స్థానిక మాజీ సర్పంచ్ బైరబోయిన సునీతా రామలింగయ్య కుమారుడు, యువజన నాయకుడు రాకేష్ హైదరాబాద్‌లో చంద్రశేఖర్ కుటుంబీకులకు శుక్రవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అర్వపల్లి గ్రామ అభివృద్ధి వాట్సాప్ గ్రూప్ ద్వారా వైద్య ఖర్చుల కోసం స్థానికులు తమకు తోచినంత ఆర్థికసాయం చేస్తున్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి లక్ష మల్లె పుష్పార్చన



స్వామివారికి మల్లెలతో పూజలు చేస్తున్న అర్చకులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. అర్చకులు ఉదయం 8గంటలకు ద్వారతోరణ, ధ్వజకుంజ ఆరాధన, చతుస్థానార్చనలు, వేద ప్రబంధపారాయణాలు, పూర్ణాహుతి, గ్రామబలి చేపట్టారు. అనంతరం ఉదయం 10గంటలకు లక్ష మల్లె పుష్పార్చన వైభవంగా జరిపించారు. సాయంత్రం 6గంటల నుంచి శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రపారాయణం, చతుస్థానార్చనలు, తీర్థప్రసాదగోష్ఠి, రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీహరి ఆచార్యులు, ఫణికుమారాచార్యులు, సంకర్షణాచార్యులు, ఎన్‌సీహెచ్.హరిచరణాచార్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : ఉపాధిహామీ పథకం కింద 2024–2025 సంవత్సరానికి గాను పండ్లతోటల పెంపకానికి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. శుక్రవారం ఉపాధిహామీ కార్యాలయంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పుస్తకం, బ్యాంకుఖాతా, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాన్‌కార్డు, గ్రామపంచాయతీ తీర్మానంతో పాటు 3 పాస్‌ఫొటోలతో పంచాయతీ కార్యదర్శి లేదా ఉపాధిహామీ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలని చెప్పారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, సపోట, ఆయిల్‌పాం తదితర తోటలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తోట పెంచుకోవటం కోసం గుంతలు తీయుట, మొక్కలు నాటడం, ఊతకర్ర కట్టడం, మొక్కల కొనుగోలు, ఎరువులు వేయడం, నెలనెలా పర్యవేక్షణ తదితర పనులకు మొత్తం 3సంవత్సరాలపాటు ఉపాధిహామీ నుంచి పూర్తిగా డబ్బులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శ్రీభూదేవి లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. శుక్రవారం దేవాలయ సమీపంలోని కోనేరులో చక్ర తీర్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవాలయం అనువంశిక ధర్మకర్తలు అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



రామన్నగూడెంలో కూలీల హాజరు నమోదును పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ దీపిక

అర్వపల్లి : రామన్నగూడెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను శుక్రవారం ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ దీపిక పరిశీలించారు. కూలీల హాజరు నమోదు శాతం తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వరకు కూలి వస్తుందని చెప్పారు. వడదెబ్బకు గురికాకుండా ఉదయం వేళలో పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. మల్లయ్య, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

కోదాడరూరల్ : కోదాడ పెద్దచెరువు శిఖం భూమిలో మట్టి పోసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్య సహకార సంఘం సభ్యులు శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఇరిగేషన్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ఎండిపోయిన సమయాల్లో కొందరు శిఖం భూమి ఆక్రమణకు తెరలేపుతున్నారని తెలిపారు. రామిరెడ్డిపాలెం రోడ్డులో ఓ వ్యక్తి రెండెకరాలకు పైగా చెరువు భూమిని ఆక్రమించుకుంటున్నాడని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి చెరువు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందరబోయిన వీరస్వామి, కోశాధికారి వేముల పుల్లయ్య, సెక్రటరి ఐతనబోయిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రెడ్డబోయిన ఉపేందర్, మర్రి సంతోష్, గుండ్లపల్లి రామారావు, సడం నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో సహస్రనామ కుంకుమార్చనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది కిరణ్‌గౌడ్, గోవింద రెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం



రావులపల్లిలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు

తుంగతుర్తి : పట్టభద్రుల సమస్యలపై గళమెత్తే ఉన్నత విద్యావంతుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని రావులపల్లి, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండా, మానాపురం, ఏనెకుంట తండా తదితర గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపాల్‌రెడ్డి, దశరథ, పూర్ణనాయక్, మనోజ్, ప్రసాద్, వెంకన్న, గోపాల్, వీరన్న, నరేష్, ధర్మ, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం గ్రామంలోని ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు శుక్రవారం గ్రామానికి చెందిన పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే పండ్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సేకు మురళీకృష్ణ – లక్ష్మీసునంద దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించినట్లు ఆ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, సభ్యులు నర్రా శ్రీపాల్‌రెడ్డి, వెంపటి ప్రసాద్ పాల్గొన్నారు.